# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం!

- యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- డ్రగ్స్ సరఫరా నియంత్రణకు కఠిన చర్యలు
- సీపీ అంబర్ కిషోర్ ఝూ



**మంచిర్యాల, మే 02 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా నస్పూర్ లో మహిళా శిశు దివ్యాంగులు వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ విద్యార్థులతో నేరుగా మాట్లాడి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు సామాజిక ప్రభావం చట్టపరమైన కఠిన చర్యల గురించి హెచ్చరించారు. మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తమ ప్రవర్తనలో మార్పులను గమనించుకోవాలని ఇబ్బంది కలిగితే వెంటనే సహాయం పొందాలని సూచించారు.

### అప్రమత్తంగా ఉండాలి

పాఠశాలల సమీపంలో డ్రగ్స్ సరఫరాను అరికట్టడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల అలవాటును ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సమాజం తల్లిదండ్రులు పాఠశాలల పాత్ర ఎంతో కీలకమని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు జిల్లా సంక్షేమ అధికారి పాల్గొన్నారు. వారితో పాటు సంబంధిత సీఐలు ఎస్ఐలు ప్రొటెక్షన్ ఆఫీసర్ సత్తయ్య చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ్ కుమార్ విద్యార్థులు హాజరయ్యారు.

# మున్సిపల్ కమిషనర్ అయాజ్ కు ఘన వీడ్కోలు!

**రెండేళ్లలో జమ్మికుంట అభివృద్ధి పథం**

**పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే మొదటి వరుస**

**అధికారులు సిబ్బంది ఆధ్వర్యంలో సన్మానం**



**జమ్మికుంట, (మనసులో మాట):** జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ బదిలీ కావడంతో అధికారులు సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. గత రెండు సంవత్సరాలుగా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిన ఆయన సేవలను కొనియాడారు. జమ్మికుంట పట్టణాన్ని అన్ని రంగాలలో ముందుంచి రాష్ట్ర స్థాయికి పరిచయం చేసిన ఘనత ఆయనదేనని అధికారులు ప్రశంసించారు. ముఖ్యంగా ఇంటి పన్ను వసూళ్లలో జమ్మికుంట మున్సిపాలిటీని రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయిలో మొదటి వరుసలో నిలపడంలో కమిషనర్ కీలక పాత్ర పోషించారని సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అయాజ్ ను శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జీ రాజిరెడ్డి, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, టీపీఓ శ్రీధర్ పాల్గొన్నారు. వీరితో పాటు టీపీఎస్ రాజ్ కుమార్, ఆర్ ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.





# కన్నవారి మరణం తట్టుకోలేక కొడుకు బలవన్మరణం!

**సదాశివపేటలో తీవ్ర విషాదం**

**సదాశివపేట, మే 02 (జనం పవర్):** సదాశివపేట పట్టణంలో గుండెలను పిండేసే విషాద ఘటన చోటుచేసుకుంది. తల్లిదండ్రుల మృతిని తట్టుకోలేక 17 ఏళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గత నెలలో జరిగిన కుటుంబ కలహాల కారణంగా అమ్మానాన్నలను కోల్పోయిన ఆ బాలుడు మనస్తాపంతో తనువు చాలించాడు. సిద్ధాపూర్‌కు చెందిన రాజు గత నెల 25న భార్య రాణిపై అనుమానంతో రోకలిబండతో దాడి చేసి హత్య చేశాడు. ఆ వెంటనే తానూ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుండి వారి కుమారుడు మధు (17) తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కళ్లముందే తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మిగిలానని కుంగిపోయాడు.

### చెట్టుకు ఉరివేసుకొని...

తీవ్ర ఆవేదనలో ఉన్న మధు శనివారం పట్టణంలోని తేజ వెంచర్స్ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేష్ తెలిపారు. ఒకే కుటుంబంలో వరుస మరణాలు సంభవించడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఎంబీబీఎస్ లో గోల్డ్ మెడల్ సాధించిన అక్షయ!

**టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడి కుమార్తె ఘనత**






- పేదలకు ఉచిత వైద్యం అందిస్తానన్న డాక్టర్ అక్షయ
- మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా పట్టా ప్రదానం

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

గాంధీ మెడికల్ కాలేజీలో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టర్ గడియారం అక్షయ ప్రతిభ చాటారు. టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి పల్లవి దంపతుల కుమార్తె అయిన అక్షయ ఎంబీబీఎస్ లో గోల్డ్ మెడల్ సాధించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆమెకు డాక్టర్ పట్టాతో పాటు బంగారు పతకాన్ని అందజేశారు. తమ కుమార్తె అత్యుత్తమ ప్రతిభ కనబరచడం పట్ల తండ్రి శ్రీహరి సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. ముఖ్యంగా పేద వర్గాలకు ఉచిత వైద్య సేవలు అందించడంలో అక్షయ ముందుంటుందని ఆయన వెల్లడించారు. అక్షయ సాధించిన ఈ విజయానికి టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని యూనిట్ల అధ్యక్షులు కార్యదర్శులు అలాగే సభ్యులు ఆమెను అభినందించారు.

# 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై అవగాహన!

**గ్రాంట్ల సద్వినియోగంపై మండల, డివిజనల్ అధికారులకు శిక్షణ**

**పారిశుధ్యం, తాగునీరు, పన్నుల వసూళ్లపై సమీక్ష**

**జనగణన-2027 స్వీయ గణనపై దిశానిర్దేశం**

**జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు పర్యవేక్షణ**



**మంచిర్యాల, మే 02 (జనం పవర్):** జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వర్ రావు జిల్లాలోని మండల పంచాయతీ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన గ్రాంట్స్ ను ఏ విధంగా సద్వినియోగం చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, మంచి నీటి సరఫరా అంశాలపై చర్చించారు. ఇంటి పన్నుల వసూలు, లైసెన్స్ రెన్యువల్ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా జనగణన-2027 స్వీయ గణన ప్రక్రియపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారులు కే. సతీష్, ధర్మరాణి పాల్గొన్నారు. మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపూరావు, అజ్మద్ ఆలీ, అక్తర్ మొహియుద్దీన్, శ్రీనివాస్ హాజరయ్యారు. అలాగే సతీష్ రెడ్డి, వెంకటేశ్, మహేష్, రమ్యశ్రీ, సుమన్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు నరేందర్, రాంకుమార్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# చెన్నూరులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ!

**సమావేశానికి తరలివెళ్లిన జైపూర్ మండల అధికారులు**

**క్లాసిక్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ స్థాయి సమావేశం**



**జైపూర్, మే 02 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జైపూర్ మండలం నుండి ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆస్నాద్ రోడ్డులోని క్లాసిక్ ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ సమావేశంలో జైపూర్ మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు పాల్గొన్నారు. వారితో పాటు సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై ప్రగతి ప్రణాళిక అంశాలపై చర్చించారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ధ్యేయంగా ఈ 99 రోజుల కార్యాచరణ సమావేశం సాగింది.

# ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన ఉద్యమకారులు!

**బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు**

**త్వరలోనే ఉద్యమకారుల కమిటీ: కోదండరాం**

**జమ్మికుంట, మార్చి 02 (జనం పవర్):** తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఉద్యమ నేత ప్రొఫెసర్ ఎం కోదండరాం ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎక్కటి సంజీవరెడ్డి కోదండరాంకు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సంజీవరెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కోదండరాం త్వరలోనే కమిటీని వేస్తామని హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బొమ్మకంటి మహేంద్రాచారి, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెండెం సర్వేషం పాల్గొన్నారు.



# పది ఎకరాల్లో దగ్ధమైన మొక్కజొన్న!

**కలెక్టరుకు నివేదిక పంపిన తహసిల్దార్ శ్రీకాంత్**

**బెజ్జంకి, మే 02 (జనం పవర్):** మండలంలోని కల్లేపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం ప్రమాదవశాత్తు పంటకు నిప్పు అంటుకోవడంతో మొక్కజొన్న పూర్తిగా దగ్ధమైంది. శనివారం మండల తహసిల్దార్ కే. శ్రీకాంత్ మొక్కజొన్న పంట నష్టంపై సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి సమగ్ర నివేదిక పంపించారు. కల్లేపల్లి గ్రామానికి చెందిన రైతులు చెలుకల కొండాల్ రెడ్డి, చేలుకల ప్రతాపరెడ్డి, చేలుకల కేశవరెడ్డిలకు చెందిన పది ఎకరాల 20 గుంటలలోని మొక్కజొన్న పంట పూర్తిగా బూడిదైంది. ఈ ఘటనతో సుమారు పది లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# జమ్మికుంట రూరల్ సీఐగా పులి వెంకట్ బాధ్యతల స్వీకరణ!

**హుజూరాబాద్ నుండి బదిలీపై వచ్చిన సీఐ**

**శాలువాతో ఘనంగా సన్మానించిన దేవస్థానం చైర్మన్**




**జమ్మికుంట, మార్చి 02 (జనం పవర్):** జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా పులి వెంకట్ బాధ్యతలు స్వీకరించారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై వచ్చిన ఆయనను శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. దేవస్థానం తరపున రాములవారి ముత్యాల తలంబ్రాలను సీఐకి అందజేసి స్వామివారి జ్ఞాపికను బహుకరించారు. అనంతరం దేవస్థానాన్ని సందర్శించాలని సీఐని రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రాములవారి ఆశీస్సులతో సీఐ విధుల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

# మేడే స్ఫూర్తితో హక్కుల పోరాటానికి సిద్ధం కావాలి!

**కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి**

**బీడీ కార్మికులకు 5 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలి**

**ప్రతి కార్మికునికి ఈఎస్ ఐ పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి**

**బీఎల్ యూ టీ రాష్ట్ర అధ్యక్షులు సిరిగాధ సిద్దిరాములు**




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేటలో బీఎల్ యూ టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడే అమరవీరుల స్మారక సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఎల్ యూ టీ రాష్ట్ర అధ్యక్షులు సిరిగాధ సిద్దిరాములు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికవర్గం తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం విడిచి కార్మికుల పక్షాన నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి ఈఎస్ ఐ పీఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రతను నిర్ధారించాలని కోరారు. కనీస వేతనాల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని బీడీ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వెయ్యి రూపాయల పెన్షన్‌ను 5 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి కంపెనీ నెలలో కనీసం 26 రోజుల పాటు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ యూ టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదురుకొల్లా ఆంజనేయులు రాష్ట్ర ఉపాధ్యక్షులు కడవేర్గు శ్రీహరి జిల్లా ప్రధాన కార్యదర్శి గోసికొండ నర్సింలు పాల్గొన్నారు. అలాగే టెకదరు యూనియన్ రాష్ట్ర నాయకులు తిరుపతి గౌడ్ కార్మికురాలు అనిత రాష్ట్ర నాయకులు తలారి ప్రవీణ్ బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బేట ఆనంద్ నాయకులు శివరాత్రి శ్రీనివాస్ ర్యాకం మహేష్ వాజిత్ దానబోయిన రాజు చంద్రం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి
- బస్వాపూర్ ఐకేపీ కేంద్రాన్ని తనిఖీ
- రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా



**కోహెడ, మే 02 (జనం పవర్):** మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ సక్రమంగా సాగుతుందో లేదో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కేంద్రంలో తేమ శాతం అధికంగా ఉన్న వడ్ల కుప్పలు ఎక్కువగా ఉన్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె వెంటనే స్పందిస్తూ తేమ తగ్గేలా తాలు తీసి గన్నీలలో నింపాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా సరిపడినన్ని గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ధాన్యపు గింజను నిబంధనల ప్రకారం సకాలంలో కొనుగోలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకతతో వ్యవహరించి రైతులకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# సిద్దిపేట అన్నదానాలకు పెట్టింది పేరు!

- ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు నిలయంగా పట్టణం
- భక్తుల కోసం ప్రత్యేక వసతుల కల్పన
- మాజీ మంత్రి టీ హరీష్ రావు
- రంగధాంపల్లిలో అన్నప్రసాద భవనం ప్రారంభం

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణం రంగధాంపల్లిలోని శ్రీ పంచవటి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన అన్నప్రసాద భవనాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే టీ హరీష్ రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అన్నదానాలకు పెట్టింది పేరుగా మారిందని కొనియాడారు. ఆధ్యాత్మికత సేవా కార్యక్రమాలకు ఈ ప్రాంతం కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. హనుమాన్ దీక్ష ద్వారా భిక్షా సంప్రదాయానికి సిద్దిపేటే పునాది వేసిందని హరీష్ రావు గుర్తు చేశారు. రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో 41 రోజులు గణేష్ నగర్ హనుమాన్ దేవాలయంలో 21 రోజులు పంచముఖ హనుమాన్ దేవాలయంలో 21 రోజుల పాటు భిక్ష కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద భవనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు.

**అభివృద్ధికి బాటలు**

సిద్దిపేటలో నిర్మితమైన అనేక భవనాలకు తన వంతు సహకారం అందించానని ఎమ్మెల్యే తెలిపారు. రంగధాంపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ఆదర్శంగా తీర్చిదిద్దామని చెప్పారు. మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం కూడా ఇక్కడే మొదలైందని గుర్తు చేశారు. హనుమాన్ దీక్ష సమయంలో వేలాది మంది భక్తులకు ఈ అన్నదాన భవనం ఎంతో ఉపయుక్తమవుతుందని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన దాతలను ఈ సందర్భంగా హరీష్ రావు ఘనంగా సత్కరించారు. అనంతరం స్వాములతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భిక్ష నిర్వహించారు.




# రెండేళ్లు దాటినా ఉద్యోగ నోటిఫికేషన్లు లేవు!

- అభ్యర్థుల ప్రిపరేషన్ పరిస్థితిపై హరీశ్ రావు ఆరా
- మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు నిరీక్షణ
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగమవుతున్న యువత
- మాజీ మంత్రి టీ హరీశ్ రావు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాజీ మంత్రి ఎమ్మెల్యే టీ హరీశ్ రావు శనివారం ముఖాముఖి నిర్వహించారు. అభ్యర్థుల ప్రిపరేషన్ పరిస్థితి అలాగే వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. రెండున్నర సంవత్సరాలుగా యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నా సరైన నోటిఫికేషన్లు ఇవ్వలేదని ఆరోపించారు.



**హామీల అమలులో వైఫల్యం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చలేదని హరీశ్ రావు పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం కేవలం 16 వేల ఉద్యోగాలే భర్తీ చేసినట్లు వెల్లడైందని గుర్తు చేశారు. విద్యా శాఖలో మెగా డీఎస్సీ పేరుతో ఆలస్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో వేలాది ఖాళీలు ఉన్నప్పటికీ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

**నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలి**

గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగాల్లో ఖాళీలను తక్షణమే నోటిఫై చేయాలని హరీశ్ రావు కోరారు. ఎస్సీ ఎస్టీ బీసీ అలాగే మైనారిటీ గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించినప్పటికీ అందులో పేర్కొన్న విధంగా ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇతర హామీల అమలులో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లోపంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వడంలో ఆలస్యం చేయకుండా వయోపరిమితి సడలింపులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

జనం పవర్
JANAM POWER



# మోయినిపురలో మహిళా భవనం ప్రారంభం!

- రూ. 25 లక్షల వ్యయంతో భవన నిర్మాణం
- హైదరాబాద్ రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ పనుల ప్రారంభం
- మున్సిపల్ సాధారణ నిధులతో అభివృద్ధి
- చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు





**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని 40వ వార్డు మోయినిపురలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా భవనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు శనివారం ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించిన ఈ భవనం సుమారు 70 మంది మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కమిషనర్ అశ్రిత్ కుమార్ అలాగే స్థానిక కౌన్సిలర్ సాయిశ్వర్ పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా అమలులో ఉందని చైర్‌పర్సన్, కమిషనర్ పేర్కొన్నారు. ఆర్పీలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని వెల్లడించారు.

### అధునాతన షాపింగ్ కాంప్లెక్స్

అనంతరం 23వ వార్డులో హైదరాబాద్ రోడ్డు వైపున దాదాపు రూ. 1.43 కోట్లతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులకు చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కమిషనర్ అశ్రిత్ కుమార్ తో పాటు స్థానిక కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, ప్రేరణ (డీఈఈ), శ్రీనాథ్, పృథ్వి (ఏఈఈ), బందారం రాజు తదితరులు పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధికి మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ప్రతినిధులు తెలిపారు.

# సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి!

**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు**



**జుక్కల్, మే 02 (జనం పవర్):** పిట్లం మండల రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ లో శనివారం జుక్కల్ నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం గృహజ్యోతి ఇందిరమ్మ ఇళ్లు చేయూత పింఛన్లు రేషన్ కార్డుల వంటి పథకాలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో సుమారు 35 వేల మందికి కొత్త రేషన్ కార్డులు అందజేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి అలాగే ఎల్ ఓ సీ ద్వారా దాదాపు 35 కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించామని వివరించారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పిట్లం మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు ఏఎంసీ చైర్మన్లు సర్పంచులు ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఎకరాకు 25 వేల నష్టపరిహారం చెల్లించాలి!

**కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి**

**బెజ్జంకి, మే 02 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని కల్లేపల్లి గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదంలో పది ఎకరాల మొక్కజొన్న పంట కాలిపోయిన ఘటనపై కిసాన్ మోర్చా నేతలు స్పందించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షుడు కొలిపాక రాజు శనివారం బాధిత రైతులను పరామర్శించి ఓదార్చారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు విమర్శించారు. పొలాల మధ్య వేలాడుతున్న కరెంట్ తీగలు నిర్వహణ లేని ట్రాన్స్ ఫార్మర్ల వల్లే పంట దగ్ధమైందని ఆరోపించారు. ఈ ప్రమాదంతో రైతులకు సుమారు పది లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదని ప్రభుత్వ వైఫల్యమేనని వారు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్ కల్లేపల్లి ఉపసర్పంచ్ బుర్ర వినీత్ గౌడ్ మండల నాయకులు గైని రాజు ఖచ్చు సంపత్ సంఘ రవి వడ్లూరి సాయిలు ఒగ్గు కనకయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# యోగా శిక్షణతో ఆరోగ్య రక్షణ!

- సిద్దిపేటలో ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరం ప్రారంభం
- విద్యార్థుల్లో ఏకాగ్రత అలాగే ఆరోగ్యం పెంపొందించడమే లక్ష్యం
- 20 రోజుల పాటు శిక్షణ అలాగే సర్టిఫికెట్ల ప్రదానం
- జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

ఆరోగ్య సిద్దిపేట లక్ష్యంతో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అలాగే వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరం శనివారం ప్రారంభమైంది. మైత్రివనం క్రాంతి హై స్కూల్ లో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని యోగా గురువులు తోట సతీష్, అసోసియేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తోట అశోక్ మాట్లాడుతూ చదువుల్లో క్రీడల్లో అలాగే జీవితంలో రాణించాలంటే ఆరోగ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. యోగా దానికి పునాదిగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం విద్య ఉద్యోగ రంగాల్లో యోగాకు ప్రాధాన్యత ఇస్తోందని యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. సిద్దిపేట యోగా క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం గర్వకారణమని అన్నారు. క్రాంతి హై స్కూల్ చైర్మన్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ యోగా వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. యోగ గురువు తోట సతీష్ మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరం 20 రోజుల పాటు కొనసాగుతుందని అలాగే శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు. జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిర నిర్వాహకురాలు శ్రీలత మాట్లాడుతూ 7 సంవత్సరాల పైబడిన



బాలబాలికలకు ప్రతిరోజూ ఉదయం 7 నుండి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. యోగా ధ్యానం అలాగే ప్రాణాయామంతో పాటు ఫన్ గేమ్స్ నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు 9666735448 నంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిప్ప ప్రభాకర్, నరేష్ తో పాటు పలువురు యోగా శిక్షకులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి!

**మహిళల భద్రతకు పోలీసు శాఖ పెద్దపీట**

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి**

**సంగారెడ్డి మెడికల్ కళాశాలలో అవగాహన సదస్సు**



**సంగారెడ్డి, మే 02 (జనం పవర్):** సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మహిళల భద్రత బాలల రక్షణ మాదక ద్రవ్యాల దుర్వినియోగం సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత జీవితాలను నాశనం చేస్తుందని హెచ్చరించారు. చిన్న వయసులోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### మహిళల భద్రతే లక్ష్యం

మహిళల భద్రతకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అదనపు ఎస్పీ తెలిపారు. షీ టీమ్స్ ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బాధిత మహిళలకు సఖీ కేంద్రం భరోసా కేంద్రం అండగా నిలుస్తున్నాయని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1930, 1098 లేదా జిల్లా షీ టీమ్ నంబర్ 8712656772ను సంప్రదించాలని కోరారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని చైతన్య రెడ్డి హెచ్చరించారు. పెట్టుబడి మోసాలు టాస్క్ స్కామ్స్ లక్కీ డ్రా పేరుతో జరిగే దందాలకు గురికావద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే మోసాలను నమ్మవద్దని అటువంటి పద్ధతి అసలు లేదని స్పష్టం చేశారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాల సమాచారం ఉంటే 1908 లేదా జిల్లా ఎస్-న్యాబ్ నంబర్ 8712656777కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్ రావు సూపరిండెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. అలాగే ఈగల్ ఫోర్స్ డీఎస్పీ పుష్పం కుమార్ సీఎస్బీ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి చైల్డ్ లైన్ ప్రతినిధి రత్నం ఇన్ స్పెక్టర్లు నాగేశ్వర్ రావు తదితరులు పాలుపంచుకున్నారు. యువత తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ప్రతినిధులు ఆకాంక్షించారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం!

**అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ధ్యేయం**

**రూ. 195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాల పంపిణీ**

**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే కొత్త రేషన్ కార్డుల మంజూరు**

**టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, మే 02 (జనం పవర్):** అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్ లో శనివారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని నిర్మల జగ్గారెడ్డి గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్లు గృహజ్యోతి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించేందుకే 99 రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు 195.18 కోట్ల రూపాయల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో జ్యోతి ఆర్డీవో రాజేందర్ సంగారెడ్డి సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత అంజమ్మ కౌన్సిలర్లు సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్ మున్సిపల్ కమిషనర్లు అధికారులు పాల్గొన్నారు.



# నాణ్యమైన విద్య ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం!

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు**

**ఆందోల్ నియోజకవర్గంలో త్వరలో ఫార్మసీ కళాశాల**

**మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం**

**రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ**





**సంగారెడ్డి, మే 02 (జనం పవర్):** జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ లో శనివారం ఆందోల్ నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందించే దిశగా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని మంత్రి వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలు అందించేందుకు ట్రామా ఎమర్జెన్సీ విభాగాలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

### మహిళా సాధికారత


మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు గతంలో పావలా వడ్డీ పథకం అమలు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ క్యాంటీన్లు సోలార్ యూనిట్లు పెట్రోల్ బంకుల వంటి వనరులను మహిళలకే కేటాయిస్తున్నామని వెల్లడించారు. ఆందోల్ నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మంత్రి ప్రకటించారు. ఈ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు 200 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో విద్య వైద్య రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని వివరించారు. ఎస్పీ పరితోష్ పంకజ్ రోడ్డు భద్రత సైబర్ నేరాలు మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# సమాచారం ఇవ్వని అధికారులపై రాష్ట్ర కమిషన్‌లో ఫిర్యాదు!

**భూ అక్రమాల విచారణ నివేదికల కోసం దరఖాస్తు**

**నెలలు గడుస్తున్నా స్పందించని కలెక్టరేట్ యంత్రాంగం**

**చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఎం శ్రీధర్ వినతి**




**సంగారెడ్డి, మే 02 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద కోరిన వివరాలు అందజేయకపోవడంపై పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ఎం శ్రీధర్ తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆయన రెండో అప్పీలుతో పాటు ఫిర్యాదు దాఖలు చేశారు. గత ఏడాది డిసెంబరు 29న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ భూ కబ్జాలు అక్రమ క్రమబద్ధీకరణలకు సంబంధించిన విచారణ నివేదికల కోసం దరఖాస్తు చేశానని శ్రీధర్ తెలిపారు. వాటిపై తీసుకున్న చర్యలు పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల వివరాలను కోరినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా జిల్లా రెవెన్యూ అధికారి ప్రజా సమాచార అధికారి స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీధర్ కోరారు. తాను కోరిన పూర్తి సమాచారాన్ని అందేలా కమిషన్ తగిన ఆదేశాలు జారీ చేయాలని తన ఫిర్యాదులో విన్నవించారు.





# హనుమంతుడి భక్తి మనోధైర్యాన్ని పెంచుతుంది!

- సిద్దిపేటలో భక్తిశ్రద్ధలతో మహాయాగం కొనసాగింపు
- లక్ష హనుమాన్ చాలీసా పారాయణం ప్రత్యేక ఆకర్షణ
- యాగంలో పాల్గొని పూజలు చేసిన ఎమ్మెల్యే

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ లో భవిష్యత్ బ్రహ్మ హనుమాన్ సిద్ధి మహాయాగం వైభవంగా జరుగుతోంది. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు ఈ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో ఇటువంటి మహాయాగం నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. హనుమాన్ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ దుర్గా ప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ యాగం ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలపరుస్తుందని తెలిపారు.

### అఖండ పారాయణం

ఈ మహాయజ్ఞంలో భాగంగా సుందరకాండ యజ్ఞం 72 గంటల పాటు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం సంకీర్తనలు హవనాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా శనివారం సాయంత్రం 6 గంటల నుండి ఒకే ఆసనంలో లక్ష హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టడం విశేషమని హరీశ్ రావు చెప్పారు. 75 గంటల నిరంతర పారాయణం మూలమంత్రాల జపంతో భక్తులను ఆధ్యాత్మికంగా చైతన్యపరుస్తున్నారని వివరించారు.

### ఆధ్యాత్మిక కేంద్రంగా సిద్దిపేట

హనుమంతుడి భక్తి మనోధైర్యాన్ని పెంచి కష్టాలను తొలగిస్తుందని హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట క్రమంగా ఆధ్యాత్మిక కేంద్రంగా ఎదుగుతోందని వేలాది మంది భక్తులు హనుమాన్ మాలలు ధరించడం సంతోషకరమని పేర్కొన్నారు. కోమటి చెరువులో నిర్వహించే తెప్పోత్సవం సిద్దిపేట ప్రత్యేకతను చాటుతుందని తెలిపారు. హనుమాన్ మాలా రూపకర్త అయిన దుర్గా ప్రసాద్ స్వామీజీ భక్తుల కోసం స్వయంగా సిద్దిపేటకు రావడం గొప్ప విషయమని కొనియాడారు. ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణలో మహాయాగం విజయవంతంగా కొనసాగుతోందని వెల్లడించారు.



- మార్కెట్ యార్డులో ధాన్యం కొనకపోవడంతో ఆవేదన
- బైపాస్ రోడ్డుపై రాస్తారోకో.. స్తంభించిన ట్రాఫిక్
- సమస్యను పరిష్కరిస్తామని పోలీసుల హామీ

# వడ్ల కొనుగోలు నిలిపివేత.. రైతుల ఆగ్రహం!

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని పత్తి మార్కెట్ యార్డ్‌లో వడ్ల కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మార్కెట్‌కు పెద్ద ఎత్తున ధాన్యం తీసుకువచ్చిన రైతులకు కొనుగోలుదారులు లేకపోవడంతో నిరాశ ఎదురైంది. తగిన ధరలు లభించడం లేదని అలాగే కొనుగోళ్లు జరగడం లేదని రైతులు ఆందోళన చేపట్టారు. సమస్య పరిష్కారం కోసం రైతులు కరీంనగర్ బైపాస్ రోడ్డులోని రంగీలా దాబా చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ట్రాక్టర్లు వాహనాలతో రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల





రాకపోకలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు రైతులతో చర్చలు జరిపారు. టూ టౌన్ సీఐ ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

# కాంగ్రెస్ సర్కారుది పచ్చి అబద్ధాల పాలన!

- అడ్డగోలు హామీలతో ప్రజలను గాలికొదిలేశారు
- ప్రోటోకాల్ పాటించకుండా అధికారుల భజన
- నిధులు లేక నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తరా తెలంగాణ బ్యూరో**

జిల్లా కలెక్టరేట్ లో శనివారం కలెక్టర్ కే హరిత అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలిచ్చి తీరా గద్దెనెక్కిన తర్వాత ప్రజలను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెడుతూ ఆమె చేసిన విమర్శలు అధికారుల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఐదు వందల రూపాయల గ్యాస్ సిలిండర్ హామీ కేవలం ప్రచారానికే పరిమితమైందని క్షేత్రస్థాయిలో ఒక్క లబ్ధిదారుడికి కూడా పూర్తి ప్రయోజనం అందడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు ఇచ్చే కనీస గౌరవం లేదని ప్రోటోకాల్ ను తుంగలో తొక్కి అధికారులు అధికార పార్టీ నాయకులకు




భజన చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధికి నయా పైసా నిధులు కేటాయించడం లేదని ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జరుగుతున్నదంతా పేపర్ల మీద ఉన్న మోసమేనని తేల్చి చెప్పారు.

### అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రభుత్వ వైఖరిని ఎండగడుతుండగా ఆర్డీవో సమావేశాన్ని అర్ధంతరంగా ముగించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తుంటే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని నిలదీశారు. అధికారులను అడ్డం పెట్టుకుని కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులకు గౌరవం లేని చోట ఉండలేమని ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదని కోవ లక్ష్మి స్పష్టం చేశారు.

